క్లుప్తంగా

ఇంటర్‌లో బాలికలదే హవా


రెబ్బ హరిత


సురేఖ

సంగం: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండలంలో బాలికలు తమ సత్తా చాటారు. సంగం గురుకుల కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులు 85 మంది బాలికలు పరీక్షలు రాయగా 53 మంది ఉత్తీర్ణత సాధించగా, 62.35 శాతంగా నమోదైంది. ఎంపీసీలో 407 మార్కులతో అర్చన ప్రథమ స్థానంలో నిలువగా బైపీసీలో 426 మార్కులతో ఐ జనని ప్రథమ స్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 70 మందికి 61 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విభాగంలో 966 మార్కులతో మమత, బైపీసీ విభాగంలో 971 మార్కులతో హర్షిత ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ మహాలక్ష్మి తెలిపారు.

చేజర్లలో 78 శాతం ఉత్తీర్ణత

చేజర్ల: ఇంటర్మీడియర్ ఫలితాల్లో చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 78 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులు బుధవారం రాత్రి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 78 శాతం మంది ఉత్తీర్ణత కాగా జూనియర్ ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 31 శాతం విద్యార్థులు పాసయ్యారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి ఆర్. అజిత్‌కుమార్ 969 మార్కులు సాధించారు.

వైఎస్సార్ బీమా నగదు పంపిణీ

ఉదయగిరి: మండలంలోని తిరుమలాపురం పంచాయతీ గుడినరవలో మంగళవారం గుండెపోటుతో మరణించిన బక్కా రవీంద్ర కుటుంబ సభ్యులకు బుధవారం సర్పంచ్ కొల్లిబోయిన కృష్ణ, కార్యదర్శి వెంకటరమణయ్య అంత్యక్రియ ఖర్చుల కింద రూ.10 వేల నగదును వైఎస్సార్ బీమా పథకం ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ సహాయకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని మంత్రి కాకాణికి వినతి


వ్యవసాయశాఖ మంత్రి కాకాణికి సమస్య వివరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు మాల్యాద్రిరెడ్డి

కలిగిరి: అకాల వర్షాలకు వరి, పచ్చిశనగ పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కలిగిరి జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రి రెడ్డి విన్నవించారు. నెల్లూరులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం స్థానిక రైతులతో కలిసి వ్యవసాయశాఖ మంత్రిని కలిశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వరి, పచ్చిశనగపంట పూర్తిగా దెబ్బతిందన్నారు. దీనిపై స్పందించిన మంత్రి కాకాణి వర్షాలకు దెబ్బతిన్న రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.


ఎంఈఓకు డీఎస్సీ 98 ఉపాధ్యాయుల సన్మానం



వరికుంటపాడు: 1998 డీఎస్సీకి ఎంపికై వరికుంటపాడు మండలంలో ఉద్యోగాలు పొందిన ఆరుగురు ఉపాధ్యాయులు బుధవారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ షావుద్దీన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

బీజేపీ దేశాన్ని అప్పుల పాలు చేస్తోంది

• కాంగ్రెస్ నేత ఎన్ తులసిరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

ఆత్మకూరు: దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అరాచక పాలన సాగిస్తోందని ఇప్పటికే అనేక ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టి దేశాన్ని అప్పుల పాలు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆత్మకూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చేవూరు శ్రీధర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తొలుత ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

సీతారామపురం: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ అన్నారు. ఆయన బుధవారం అయ్యవారిపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పకుండా వేయాలన్నారు. జగనన్న ఇళ్ల స్థలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ ఏఈ రామకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నారాయుడు పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం

• కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పైరవీలు
• దొంగ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారిన వైనం



కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కావలి: దొంగ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా మారిన కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రైవేట్ వ్యక్తుల గుప్పెట్లో బందీ అయిపోయింది. సబ్ రిజిస్ట్రార్ నుంచి అటెండర్ వరకు దళారులను అడ్డం పెట్టుకుని దర్జాగా దోచుకుంటున్నారు. ప్రైవేట్ సైన్యం సామ్రాజ్య కేంద్రంగా మారింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని రికార్డులు, ముఖ్యంగా పాత రికార్డులు పరిశీలించాలన్నా, నకళ్లు కావాలన్నా అంతా ఓ ప్రైవేట్ వ్యక్తి ద్వారానే జరుగుతోంది. సదరు ప్రైవేట్ వ్యక్తి అందుబాటులో లేకపోతే ఆ పనులు ఎవరూ చూడడానికి వీల్లేకుండా వాయిదా వేస్తారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాత రికార్డులు కావాల్సిన వారు తొలుత దళారులను ఆశ్రయించాలి. కావలి పట్టణంలో ఒక మీ సేవ కేంద్రం నిర్వహిస్తున్న ప్రైవేట్ వ్యక్తి ఈ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా కీలకమైన విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను డాక్యుమెంట్లు కంప్యూటీకరణ, ముఖ్యమైన ఇతర పలు చేస్తుంటాడు. మరొక ప్రైవేట్ వ్యక్తి ఈసీ, నకళ్లు వంటివి పర్యవేక్షణ చేస్తుంటాడు. ఈసీ, నకళ్లలో పొందుపరచాల్సిన అంశాలు ఎలా కావాలంటే అలా సెట్ చేసి ఇస్తుంటారు. ఈ దళారుల హడావుడి చూస్తే కార్యాలయంలో కష్టపడి విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులుగా భావన కలుగుతోంది. కాని వీరు ప్రైవేట్ వ్యక్తులు. కనీసం తాత్కాలిక ఉద్యోగులు కూడా కారు. అట్లాగని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు సేవా దృక్పథంతో సేవలు అందిస్తున్నారా అంటే అదీ లేదు. దళారులకు అవసరమైన పనులు వేగంగా, దళారులకు అవసరమైన విధంగా కార్యాలయంలో పనులు చక్క బెట్టడం, కార్యాలయం నుంచి అవసరమైన డాక్యుమెంట్లు బయటకు తీసుకురావడం వీరి పని. కొందరు దళారులుగా డాక్యుమెంట్ రైటర్లు వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ వ్యక్తులు కూడా కార్యాలయంలో తిష్ట వేసి ఉన్న ప్రైవేట్ వ్యక్తులకు, కార్యాలయ సిబ్బంది, అధికారులకు అక్రమ సంపాదన బంగా అందించే సైన్యంగా తయారయ్యారు. కార్యాలయంలో ఒక ఉద్యోగి దళారులకు అవసరమైన పనులు చక్కబెట్టే నైపుణ్యంతో చేసే దందాల్లో భాగంగానే ఇటీవల వెలుగు చూసిన దొంగ రిజిస్ట్రేషన్లు. సదరు ఉద్యోగి ఒక దళారీతో కుమ్మక్కై ఒకరి ఆస్తిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయడానికి అవసరమైన నకిలీ ఆధార్‌తో సహా అన్ని ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించాడు.

విచారణ ప్రారంభించాం

కావలిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పనితీరుపై విచారణ ప్రారంభించాం. ఇటీవల జరిగిన దొంగ డాక్యుమెంట్లు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్లు చేసిన అంశంతో పాటు మిగిలిన అంశాలపై విచారణ జరుగుతోంది. కావలిలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి బుధవారం వచ్చి అన్ని అంశాలను పరిశీలించాను. ఇంకా లోతుగా పూర్వ పరాలు తెలుసుకుని నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– ఏ బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్, నెల్లూరు.

ఆ నేతలను ఆదర్శంగా తీసుకుంటా


దివంగత బీఎస్సార్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ చేస్తున్న నాయకులు

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గాన్ని గతంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు అభివృద్ధి చేశారని, తాను ఆ నేతలను ఆదర్శంగా తీసుకుని ఆత్మకూరు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం జరిగిన దివంగత డాక్టర్ బీఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతూ మూడు మార్లు ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన సుందరరామిరెడ్డి ఈ ప్రాంత ప్రజలకు విశేష సేవలు అందించారన్నారు. డాక్టర్‌గా వీలైనంతలో ఉచిత వైద్యసేవలు అందించిన గొప్ప వ్యక్తి అన్నారు. తాను రాజకీయాలకు కొత్తని వేదిక మీద ఉన్న సీనియర్ రాజకీయ నాయకులతో కలిసి పాల్గొనడం సంతోషంగా ఉందని, అభివృద్ధిలో వారందరూ సహకరించాలని కోరుతున్నానని తెలిపారు.

గొప్ప మానవతావాది

మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి

డాక్టర్ బి.సుందరరామిరెడ్డి పేదలకు ఉచిత వైద్యం అందించిన గొప్ప మానవతావాదిగా చరిత్రలో నిలిచారని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ మూడు మార్లు ఆత్మకూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ బీఎస్సార్ వివాదాలకు దూరంగా ఉండేవారన్నారు. ప్రజా వైద్యుడిగా ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారని, రాజకీయాల్లోనూ మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకొని ప్రముఖ పాత్ర పోషించారని, ప్రజలకు అందుబాటులో ఉండేవారన్నారు. గతంలో బీఎస్సార్ కుమారుడు రాఘవేంద్రరెడ్డిని జెడ్పీ చైర్మన్‌గా ఎన్నిక చేయించే క్రమంలో చోటు చేసుకున్న నాటకీయ పరిణామాలను, అప్పటి ఎమ్మెల్యే గౌతమ్‌రెడ్డి సహకారాన్ని గుర్తు చేశారు. సుందర రామిరెడ్డి కుమారుడిగా ఆయనకు తన సహకారం అందించామన్నారు. ఈ సందర్భంగా నాయకులతో దివంగత బీఎస్సార్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గోపవరం వెంకటరమణమ్మ, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, గూటూరు మురళీ కన్నబాబు, చంద్రా రాజగోపాల్, సీహెచ్ దేవకుమార్ రెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకమే జగన్ ప్రభుత్వ ఆశయాలు

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రజలు పెట్టుకున్న ఆశలను, నమ్మకాన్ని ప్రభుత్వ ఆశయాలుగా అమలు చేస్తున్న దేశంలోని ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైకుంఠపురంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను పలకరించారు. వారితో ప్రభుత్వ పథకాల గురించి ఆరా తీశారు. తమ కుటుంబానికి ఏఏ పథకాల అందాయో లబ్ధిదారులే స్వయంగా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆలోచనలు, వారి అభీష్టం మేరకు పాలకులు పాలన చేయాలని పుస్తకాల్లో చదువుకునే వాళ్లమని గుర్తు చేశారు. అలాంటిది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఏది అవసరమో, ఎప్పుడు అవసరమో, తెలుసుకుని వాటిని ఆయా సందర్భాన్ని బట్టి నేరుగా లబ్ధిదారులకు అందేలా చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. అందుకే ప్రజలు సీఎంగా జగన్ మరో 30 ఏళ్ల పాటు ఉండాలని దీవిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు గుడ్లూరు మాల్యాద్రి, వేగూరు చిన్న పుల్లయ్య పాల్గొన్నారు.

పట్టణంలో భూ సర్వే ప్రారంభం


డ్రోన్ సర్వేను ప్రారంభించిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: పట్టణంలోని ప్రైవేట్, పబ్లిక్ స్థిర ఆస్తులను డ్రోన్ ద్వారా సాంకేతిక సహాయంతో సర్వే చేసే 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష' కార్యక్రమాన్ని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్తుల విషయంలో ప్రజలు తరతరాలుగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. బ్రిటిష్ కాలం నాటి పొలాలు సరిహద్దులే నేటికీ అమల్లో ఉన్నాయని చెప్పారు. వీటన్నింటినీ శాశ్వతంగా పరిష్కరానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రిటిష్ పాలకులు తర్వాత వందేళ్ల వరకు భూ సమస్యలు లేకుండా చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. భారీ వ్యయంతో కూడిన వ్యవహారం అయినప్పటికీ పూర్తిస్థాయిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే ప్రక్రియ చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం ఎలాంటి మంచి పనులు చేయడానికైనా సీఎం జగన్ వెనకాడరని, అందుకే ఆయన ప్రజల మనిషిగా స్వల్పకాలంలోనే ఆదరాభిమానాలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వీకే శీనానాయక్, తహసీల్దార్ కె.మాధవరెడ్డి, మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్ యు.శ్రీనివాసరావు, సర్వేయర్లు, సర్వే విధుల్లో పాల్గొనే సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిపాడు తహసీల్దార్ బోగోలుకు బదిలీ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు తహసీల్దార్ పసుపులేటి హేమంత్‌కుమార్‌ను బోగోలు తహసీల్దార్‌గా బదిలీ చేస్తూ కలెక్టర్ హరినారాయణన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మర్రిపాడు తహసీల్దార్‌గా ఎవరిని నియమించలేదు.

హౌసింగ్ లేఅవుట్ల పరిశీలన

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి, గన్నేపల్లి పంచాయతీల్లోని గృహ నిర్మాణశాఖ లేఅవుట్లను బుధవారం ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఏఈ రామకృష్ణ పరిశీలించారు. అనంతరం పుల్లాయపల్లె పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కల్లూరి శ్యామలాదేవి అధ్యక్షతన లబ్ధిదారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం పనుల పురోగతిపై కాంట్రాక్టర్‌తో సమీక్షించారు. మండల స్థాయిలో పుల్లాయపల్లె పంచాయతీ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది సర్పంచ్ శ్యామలాదేవి, కార్యదర్శి తేజలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరీముల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.కృష్ణారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్ష, సీఏ ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్సార్‌లో సందడిగా యూత్ కార్నివాల్

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో యూత్‌కార్నివాల్ పేరుతో విద్యార్థులు బుధవారం నిర్వహించిన హంగామా ఆద్యంతం సందడిగా సాగింది. విద్యార్థులు పుస్తక పరిజ్ఞానాన్ని, ప్రపంచీకరణ అవకాశాలను మేళవించి సృజనాత్మకంగా రూపొందించిన వివిధ స్టాల్స్ చూపరులను ఆకట్టుకున్నాయి. చదువులతో పాటు వాణిజ్య నిర్వహణలో కూడా మెళకువలు నేర్పించేలా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలు విద్యార్థులకు నూతన విజ్ఞాన్ని అందించాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే తీరప్రాంతాల అభివృద్ధి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి


అలిచెర్ల బంగారుపాలెంలో లబ్ధిదారాలికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలోని తీరప్రాంత గ్రామాల అభివృద్ధితో పాటు మత్స్యకారులకు అండగా నిలిచింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమేనని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. అలిచెర్లబంగారుపాళెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. పేదల జీవితాల్లో మార్పులు తీసుకు వచ్చేందుకు, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను వివరించడంతో పాటు ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి పథకాలు అందించాలనే ధ్యేయంతో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ఏ పథకం కావాలన్నా నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకే వస్తుందని వివరించారు. తీరంలోని మత్స్యకారులకు అండగా నిలిచేందుకు, మత్స్యకార యువతకు ఉపాధి కల్పించేందుకు పలు పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. భారీ వ్యయంతో జువ్వలదిన్నె వద్ద ఏర్పాటు చేస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు కూడా దాదాపుగా పూర్తి కావచ్చాయని తెలిపారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తయితే కావలి నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలతో పాటు జిల్లాలోని మత్స్యకారులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, సర్పంచ్ గోవిందస్వామి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం


జగనన్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వరికుంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు ఆంధ్రా బాలగురవారెడ్డి, వరికుంటపాడు సొసైటీ అధ్యక్షుడు కామేపల్లి వెంకటరత్నం అన్నారు. బుధవారం విరువూరులో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దేవనబోయిన మధు, నాయకులు జి.పుల్లయ్య, టి.తిరుపతిరెడ్డి, బి.రాజేంద్ర, ఎం.మస్తానయ్య, కాలే వెంకటేశ్వర్లు, చిందె వెంకటేశ్వర్లు, బాలచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు


ఆదినారాయణపురంతో మాట్లాడుతున్న సీఐ రాజేష్

అల్లూరు: శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రాజేష్ హెచ్చరించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదినారాయణపురం గ్రామస్తులకు హెచ్చరికలు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆదినారాయణపురంలో స్కూల్ పిల్లల దగ్గర వచ్చిన చిన్న సమస్యకు రెండు వర్గాల మధ్య గొడవలు పడేంత పని అయిందన్నారు. తరచుగా ఈ గ్రామంలో చిన్న చిన్న సమస్యలకు రెండు వర్గాల మధ్య గొడవులు జరుగుతున్నాయన్నారు. ఎవరైనా గొడవలకు దిగినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులను నమోదు చేస్తామన్నారు. త్వరలోనే తమ గ్రామంలో ప్రతి ఇంటిని సోదా చేసి తమ వద్ద ఎవరి వద్దనైనా మారణాయుధాలు, రాడ్లు వంటివి ఉంటే వారిపై కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాసుల రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండో పంటకు నీరందించేందుకు కృషి


అల్లిమడుగు బ్రాంచ్ కాలువ కింద రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి

బిట్రగుంట: అల్లిమడుగు బ్రాంచ్ కాలువ కింద రెండో పంటకు సాగునీరందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అల్లిమడుగు బ్రాంచ్ కాలువ ఆయకట్టు రైతులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని బుధవారం కలిసి రెండో పంటకు సాగు నీరందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయకట్టు కింద ప్రధానంగా సన్న, చిన్నకారు రైతులే ఉన్నారని, రెండో పంటకు సాగునీరందిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని విజ్ఞప్తి చేయడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సాగునీరందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

సూపర్‌వైజరు ఘటనపై కారకులను కఠినంగా శిక్షించాలి

ఉదయగిరి: సీతారామపురం ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కార్యకర్త, తాత్కాలిక సూపర్‌వైజరు నిఖిత ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి రెహనాబేగం డిమాండ్ చేశారు. ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితురాలిని బుధవారం వారు పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఐసీడీఎస్ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నిఖితకు కేటాయించిన తాత్కాలిక సూపర్‌వైజరు విధులు నిర్వహిస్తోందన్నారు. ఆమె ఆత్మహత్యాయత్నానికి కారకులైన పేర్లను లేఖ రూపంలో పోలీసులకు బాధితురాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. వారితో పాటు సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య, గడ్డం నాగేశ్వరరావు, లక్ష్మి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికారం పంపిణీ



సీతారామపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు బుధవారం వైద్య సిబ్బంది పౌష్టికాహారం అందజేశారు. బిస్కెట్లు అందజేశారు. టీబీ వ్యాధిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 2025 నాటికి పూర్తిగా టీబీని నయం చేయటమే లక్ష్యంగా పెట్టుకొన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవికుమార్, స్వప్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

ఆత్మకూరు: పాలిటెక్నిక్ ఎంట్రన్స్ రాసే విద్యార్థులకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ బుధవారం తెలిపారు. 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎంట్రన్స్ పరీక్ష ఆత్మకూరు పట్టణంలోని మూడు కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్‌పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 98856 31747 నంబరులో సంప్రదించాలన్నారు.

చేవూరు శ్రీధర్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ

ఆత్మకూరు: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చేవూరు వెంకట రమణారెడ్డి ఉత్తరక్రియల నేపథ్యంలో పలు పార్టీల నాయకులు ఆయన కుమారుడు పీసీసీ ప్రధాన కార్యదర్శి చేవూరు శ్రీధర్‌రెడ్డిని బుధవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని కృష్ణయ్య, సీవీ శేషారెడ్డి, తాళ్లూరి గిరి నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, చల్లా రవికుమార్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్‌రెడ్డి, రఘురామ్ ముదిరాజ్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

నేడు ప్రకాశ్ అంబేడ్కర్ కావలికి రాక



కావలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మనవడు ప్రకాశ్ అంబేడ్కర్ గురువారం కావలికి వస్తున్నట్లు స్థానిక జనప్రకాషిని అధ్యక్షుడు కె.రవీంద్రకుమార్, అంబేడ్కర్ బుద్ధ విహార్ వ్యవస్థాపకులు పూజల జయప్రకాష్, సంఘ జ్యోతి బౌద్ధాచార్యులు ఎం.మాలకొండారెడ్డి తదితరులు చెప్పారు. కావలిలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆ రోజు ఉదయం 11 గంటకు పట్టణంలోని అంబేడ్కర్ బుద్ధ విహార్‌లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బైక్ ర్యాలీగా కావలి నుంచి బయలుదేరిగా కావలి మండలం చలంచర్లలో నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులను అందిస్తున్న ఐటీడీఏ అధికారులు

అల్లూరు: మండలంలోని తూర్పు గోగులపల్లి గోపాలపురం కాలనీలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మూడు పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన ఆ గిరిజన కుటుంబాలకు బుధవారం నెల్లూరు ఐటీడీఏ అధికారులు బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు దాసరి పోలయ్య మాట్లాడుతూ అడిగిన వెంటనే పేద గిరిజన కుటుంబాలకు తమ సహకారం అందించిన ఐటీడీఏ అధికారులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు యూ.శ్రీనివాసులు, ఆర్.శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట శీనయ్య, గోళ్ల ఆదామ్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత దాణాతో అధిక పాలదిగుబడి

కలిగిరి: పాడి రైతులు పశువులకు సమీకృత దాణాతో అధిక పాల దిగుబడులు పొందవచ్చునని పెద్దకొండూరు పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు తెలిపారు. నాగసముద్రం ఆర్బీకేలో బుధవారం పశు విజ్ఞానబడి కార్యక్రమంలో భాగంగా పశుగ్రాసం పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. పశువులకు అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 1962కు సమాచారం ఇస్తే పశు అంబులెన్స్ వచ్చి వైద్య సేవలు అందిస్తుందన్నారు. పాడిరైతులకు రాయితీతో దాణా, పశుగ్రాసం పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. పశువైద్యశాల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

29న సమావేశం

చేజర్ల: అనంతసాగరం మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 29న శనివారం ఉదయం 11 గంటలకుజరుగుతుందని ఎంపీడీఓ మధుసూదన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.